సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం। 23। డిసెంబర్। 2022



మన్యం గజగజ
- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- మూడు రోజులుగా పెరిగిన చలి తీవ్రత
- చలి మంటలతో ఉపశమనం

8లో



ప్రభుత్వాస్పత్రిలోనే సుఖ ప్రసవాలు చేయాలి 8లో

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు సాధ్యమని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు.

ఏవోబీలో 40 ఎకరాల్లో గంజాయి ధ్వంసం 8లో



న్యూస్‌రీల్

గణితంలో పట్టు తప్పనిసరి

ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

సాక్షి, పాడేరు: విద్యార్థులు గణితంలో పట్టుసాధించాలని ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలోని శ్రీనివాస రామానుజన్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావుల్లో ఒకరైనా దేశానికి చెందిన గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్, అతిచిన్న వయసులోనే గణితంలో ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాక్షించారు. సీనియర్ అధ్యాపకులు మురళీధర్, కోటేశ్వరరావు, చంద్రకళ, ధర్మరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి రాణింపు



నమూనాలను పరిశీలిస్తున్న జాకీర్‌హుస్సేన్

సీలేరు: విద్యార్థి దశ నుంచి రాణించి దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఏపీ జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్ అన్నారు. స్థానిక డీఏవీ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాసరామానుజన్ చరిత్రను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు. శ్రీనివాసరామనుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రరావు, గణిత ఉపాధ్యాయులు బాలనరేష్, ఫణికల్యాణ్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

వంజంగిలో డిజిటల్ బిల్లింగ్

టోల్‌గేట్ నిర్వాహకులకు మెషీన్ అందజేసిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



డిజిటల్ బిల్లింగ్ మిషన్‌ను పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: వంజంగిలో మేఘాల కొండలు, మంచు అందాలను వీక్షించేందుకు వెళ్లే పర్యాటకులు చెల్లించే ప్రవేశబిల్లుల నగదుకు సంబంధించి డిజిటల్ బిల్లింగ్ మిషన్‌ను గురువారం ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ నిర్వాహకులకు అందజేశారు. వంజంగి టోల్‌గేటు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. వంజంగి కొండపై నెట్ సదుపాయం కల్పించాలని, గ్రావెటీ ద్వారా తాగునీటి పథకం నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎంపీడీవో నవీన్‌ను ఆదేశించారు. ఎస్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఏడు వరి కుప్పలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో గురువారం సంభవించిన ప్రమాదంలో ఏడు వరికుప్పలు దగ్ధమయ్యాయి. ఆటోతో వరి నూర్పిడి చేస్తుండగా ఇంజన్‌లోంచి మంటలు రేగాయి. గడ్డికి అంటుకుని వరి కుప్పలకు వ్యాపించడంతో ప్రమాదం సంభవించింది.ఈ ఘటనలో కొర్రా గ్రామానికి చెందిన ప్రధాని జలందర్, ప్రధాని బొంజుబాబు, వంతల సీతారాంకు చెందిన వరి కుప్పలు బూడిదయ్యాయి. మంటలు ఆర్పేందుకు గ్రామస్తుల ప్రయత్నం ఫలించలేదు. కష్టపడి పండించిన పంట అగ్నిప్రమాద రూపంలో బూడిద అవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సుమారు రూ.3 లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. బాధిత రైతులను వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ అర్జున్, గణపతి, శ్రావణ్ కుమార్, బాలరాజు పరామర్శించారు. ప్రమాదసమాచారాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని బాధిత రైతులకు హామీ ఇచ్చారు.

గిరి యువతకు అండగా

గిరి యువతకు మంచి రోజులు వచ్చాయి. **ఉన్నతస్థాయికి చేరుకునేందుకు** అవసర**మైన సహకారాన్ని పూర్తిస్థాయిలో పోలీసుశాఖ అందిస్తోంది. అదేశాఖలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ప్రతిభ ఆధారంగా 300 మందిని** ఎంపిక **చేసి ఉచిత శిక్షణ చేపట్టింది.**

- **ప్రభుత్వ కొలువుల సాధనకు పోలీసుశాఖ సహకారం**
- **కానిస్టేబుల్, ఎస్‌ఐ ఉద్యోగాల దరఖాస్తుదారుల్లో ప్రతిభావంతుల ఎంపిక**
- **300 మందికి ఉచిత శిక్షణ**
- రంపచోడవరం వైటీసీలో 45 రోజులపాటు నిర్వహణ



రంపచోడవరం వైటీసీలో శిక్షణ పొందుతున్న గిరిజన యువత

రంపచోడవరం: ప్రభుత్వ ఉద్యోగ అన్వేషణలో గిరి పుత్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. తాజాగా పోలీసుశాఖలో కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయింది. దీంతో ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో రంపచోడవరం వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్)లో 300 మంది గిరిజన యువతకు ఎస్‌ఐ, కానిస్టేబుల్, ఎస్ఎఎస్ సీ(సెంట్రల్ కానిస్టేబుల్) ఉద్యోగాలకు పరీక్ష రాయనున్న అభ్యర్థులకు రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా శిక్షణ ఇస్తున్నారు.

పదిరోజులుగా శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు పోలీసుశాఖ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించింది. పరీక్షల్లో కనీస ప్రతిభ కనబరిచిన 300 మంది గిరి యువతను ఎంపిక చేశారు. రంపచోడవరం వైటీసీలో శిక్షణ ప్రారంభించారు. 40 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణ ఇప్పటికే 10 రోజులు పూర్తయింది. ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికకు పరీక్షలు రాసేందుకు అభ్యర్థులకు లెక్కలు, జనరల్ స్టడీస్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా గుర్తింపు ఉన్న శిక్షణ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్నారు.

పూర్తిస్థాయిలో వసతి

శిక్షణకు వచ్చిన గిరిజన అభ్యర్థులకు రంపచోడవరంలోనే వసతి ఏర్పాటు చేశారు. రంపచోడవరం పీఎంఆర్‌సీలో బాలురకు, వైటీసీలో బాలికలకు వసతి కల్పించారు. ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనంతో పాటు, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నారు. వైటీసీలో శిక్షణ పూర్తిస్థాయిలో పోలీసు అధికారుల పర్యవేక్షణలో జరుగుతోంది. హెచ్‌సీ, మరో నలుగురు పోలీస్ సిబ్బందితో పాటు నలుగురు మహిళ పోలీసులను అక్కడే విధుల్లో నియమించారు.

పూర్తి స్థాయి పర్యవేక్షణ



పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీకి ఎంపిక కోసం గిరిజన అభ్యర్థులకు జిల్లా వ్యాప్తంగా రంపచోడవరం వైటీసీలో శిక్షణ ఇస్తున్నాం. ఉన్నతాధికారులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. గిరిజన యువత పోలీసు ఉద్యోగాలు సాధించాలనేది పోలీసు ఉన్నతాధికారుల ఉద్దేశం. అభ్యర్థులతో దరఖాస్తులను సైతం మా పర్యవేక్షణలో జరిగింది. రాత పరీక్షలో ఎంపికైన వారికి ఫిజికల్ టెస్టుకు, తదుపరి పరీక్షకు శిక్షణ ఉంటుంది.

– అధిరాజ్‌సింగ్‌రాణా, ఏఎస్పీ, రంపచోడవరం

శిక్షణ బాగుంది



పోలీసు కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశా. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో నాలుగు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నా. లెక్కలు, హిస్టరీ, ఇంగ్లీషు సబ్జెక్టు బాగా చెబుతున్నారు. శిక్షణ ద్వారా కానిస్టేబుల్ రాత పరీక్షలో ఎంపిక అవుతాననే నమ్మకం ఉంది. **–వెంకటరెడ్డి**, మోతుగూడెం

మెరుగ్గా వసతులు



పోలీసుశాఖలో ఉద్యోగాల ఎంపిక కోసం ఇస్తున్న శిక్షణ బాగుంది. మంచి వసతి కల్పించారు.శిక్షణ తరువాత చదువుకునేందుకు కూడా సౌకర్యాలు చాలా బాగున్నాయి. కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశాను. ప్రస్తుతం పొందుతున్న శిక్షణ చాలావరకు ఉపయోగపడుతుందని భావిస్తున్నా. **–విష్ణు తేజ**, ఎటపాక

సంక్రాంతి వేళ సిరులు

మన్యంలో గిరి రైతులను ప్రకృతి కరుణించింది. సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు మంచి దిగుబడులు సాధించారు. వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. సంక్రాంతి పండగ దగ్గర పడుతుండటంతో వారపు సంతలు సందడిగా మారాయి.

- కలిసొచ్చిన వాతావరణం
- ఆశాజనకంగా దిగుబడులు
- జోరుగా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు

సాక్షి, పాడేరు: మన్యంలో ఈ ఏడాది రాజ్‌మా సాగు గిరి రైతులకు సిరులు కురిపించనుంది. రాష్ట్ర ప్రభుత్వం 9 వేల ఎకరాల సాగుకు అవసరమైన 4,600 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను 90 శాతం రాయితీపై ముందుగానే సరఫరా చేసింది. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. గురువారం గుత్తులపుట్టు, జి.మాడుగుల మండలం మద్దిగరువు వారపుసంతల్లో రాజ్‌మా గింజలను గిరి రైతులు విక్రయించారు. సీజన్ ప్రారంభంలోనే మంచి ధర పలికింది. కిలో రూ.70కు వ్యాపారులు కొనుగోలు చేయ



గిరి రైతులు తీసుకువచ్చిన అల్లం బస్తాలు



కించుమండ సంతకు తీసుకువచ్చిన క్యారెట్

డంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, సామ గింజల విక్రయాలు చేపట్టారు.

కూరగాయల అమ్మకాల జోరు

ఈ ఏడాది కూరగాయల దిగుబడి బాగుంది. అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, అనంతగిరి, పాడేరు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, తాజంగి, చింతపల్లి, ఆర్‌వీనగర్, దారకొండ వారపుసంతల్లో కూరగాయల వ్యాపారం భారీగా జరుగుతోంది. 40కిలోల క్యారెట్ రూ.500 నుంచి రూ.600, క్యాబేజీ రూ.300 నుంచి రూ.400, కాలీఫ్లవర్ కావిడ రూ.700, 20 కిలోల టమాట రూ.300కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అల్లం ధర బాగానే ఉంది. కిలో రూ.30కు తగ్గకుండా విక్రయిస్తున్నారు. అల్లం రైతులు నిర్ణయించిన ధరకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

కరుణించిన ప్రకృతి

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిశాయి. పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు కురిశాయి. వరి, చిరుధాన్యాలు, వాణిజ్య, కూరగాయ పంటలకు వాతావరణ పరిస్థితులు కలిసొచ్చాయి. మార్కెట్ పరిస్థితులు కూడా కలిసివస్తే మంచి ఆదాయం పొందవచ్చు.

–ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి

స్ఫూర్తి ప్రదాత చిన్నాలమ్మకు అరుదైన గౌరవం



చిన్నాలమ్మను సత్కరిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి

పెదబయలు: సాటి రైతుల కోసం సొంత నిధులు వెచ్చించి చెక్‌డ్యామ్ నిర్మించి ఆదర్శంగా నిలిచిన కిముడుపల్లికి చెందిన ఆదివాసీ మహిళా రైతు కోడా చిన్నాలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో సామాజికంగా వివిధ రంగాల్లో సేవలందించిన పలువురిని విశాఖపట్నం శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సత్కరించారు. దీనిలో భాగంగా కోడా చిన్నాలమ్మకు ప్రోత్సాహక అవార్డు, జ్ఞాపికను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆమె ఎంతో సంతోషానికి గురయ్యారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

జీసీసీ ఎండీ సురేష్‌బాబు



కాఫీ రైతులతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ సురేష్‌బాబు

జి.మాడుగుల: ఏజెన్సీలో గిరిజన రైతులు పండించే కాఫీకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గిట్టుబాటు ధర కల్పిస్తుందని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ బాబు తెలిపారు. మండలంలో సొలభం, కుద్దంగి, గొడుగుమామిడి, డేగలరాయి, తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని కాఫీ రైతులతో ఆయన మాట్లాడారు. కాఫీ పంట దిగుబడులు, విక్రయాలు, ధరలపై రైతులతో ఆయన మాట్లాడారు. గిరిజన సహకార సంస్థ అందిస్తున్న ధరలు వివరాలు రైతులకు ఆయన తెలిపారు. కాఫీ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, జీసీసీకి విక్రయించి గిట్టుబాటుధర పొందాలని ఆయన సూచించారు. పాచిమెంట్ కాఫీ కిలో రూ. 270 ధర జీసీసీ చెల్లిస్తోందని, రైతులు పాచిమెంట్ కాఫీని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు విద్యా బోధన, మెనూ, ఆరోగ్యం తదితర వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధవహించాలని ఆయన సూచించారు. జీసీసీ పెట్రోల్ బంక్‌ను ఆయన తనిఖీ చేశారు. బంక్‌లో మరామ్మతు పనులను ఆయన పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ అమ్మకాల వివరాలను ఆయన తెలుసుకున్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో పెట్రోల్, డీజిల్ ఉంచాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు జీసీసీ డీఎం కె.పార్వతి, జీసీసీ బ్రాంచి మేనేజర్ కొండన్న, జీసీసీ సిబ్బంది రామచంద్రరాజు, పంతులనాయుడు, జీసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల ఆధార్ సీడింగ్‌కు అధిక ప్రాధాన్యం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: ఉపాధి హామీ వేతనదారుల జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన అన్నిమండలాల్లో అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.గిరిజనాభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 13 వేల మంది జాబ్‌కార్డుదారులకు ఆధార్ సీడింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. ఆయా పనులన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబలైజేషన్‌ను పెంచాలని. మన బడి నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఏజెన్సీలోని పలు ఇంజనీరింగ్‌శాఖలు చేపడుతున్న అన్ని రోడ్ల పనులపై సమీక్షించిన పీవో వీటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డీవీఆర్‌ఎం రాజు,లావణ్యకుమార్,కొండయ్యపడాల్,బాలసుందరబాబు పాల్గొన్నారు.

తల్లిపేగు కన్నీరుమున్నీరు

- చిన్నారిని కాపాడుకునేందుకు కన్నతల్లి విశ్వప్రయత్నం
- అయినా దక్కని ప్రాణం




శిశువు మృతదేహాన్ని పట్టుకుని విలపిస్తున్న తల్లి లోవమల్లిక

రాజవొమ్మంగి: అనారోగ్యంతో బాధపడుతున్న శిశువును కాపాడుకునేందుకు ఆ తల్లిపడిన కష్టం అంతా ఇంతా కాదు. అయినా చివరికి ప్రాణం దక్కకపోవడంతో తల్లిపేగు కన్నీరుమున్నీరయింది. వివరాలిలాఉన్నాయి. రాజవొమ్మంగి మండలం జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలోని మిరియాలవీధికి చెందిన ఐదు నెలల శిశువు (పాప) గురువారం మరణించింది. శిశువు అస్వస్థతకు గురికావడంతో తల్లి మిరియాల లోవమల్లిక పీహెచ్‌సీకు తీసుకొని వచ్చింది. కాగా అప్పటికే పాప మరణించినట్లు వైద్యాధికారి సేవ సుజి తెలపడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. లోవమల్లిక ఐదు నెలల క్రితం ఏలేశ్వరం సీహెచ్‌సీలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈనెల 21వ తేదీన అనారోగ్యానికి గురైన పాపను జడ్డంగి పీహెచ్‌సీకు తీసుకొని వచ్చింది. అవసరమైన చికిత్స చేసి పంపామని డాక్టర్ సుజి విలేకరులకు తెలిపారు. ఆ తరువాత వారు పాపను ఏలేశ్వరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో రొంప, దగ్గుకు చికిత్స చేయించారన్నారు. కాగా గురువారం మరో సారి ఆసుపత్రికి వచ్చారని, అయితే పాప అప్పటికే మరణించిందని డాక్టర్ సుజి తెలిపారు. పాప మృతదేహంతో పాటు కుటుంబీకులను అంబులెన్స్‌లో మిరియాలవారి వీధికి పంపారు.

రాజ్‌మా పంట కుప్పకు నిప్పు

గుర్తు తెలియని వ్యక్తులు అంటించడంతో బూడిద



బూడిదైన రాజ్‌మా పంట కుప్ప

గూడెంకొత్తవీధి: ఆరుగాలం కష్టపడి పండించిన రాజ్‌మా పంట కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలి బూడిదైంది.మండలంలోని రింతాడ పంచాయతీ అరటిచెట్ల వీధిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత గిరిజన రైతు వంతల లక్ష్మణరావు మాట్లాడుతూ రెండెకరాల్లో ఈఏడాది రాజ్‌మా పంట వేసినట్టు చెప్పాడు. పంట కోతకు రావడంతో దాన్ని నూర్పులకోసం పంట పొలంలో కుప్పగా వేయగా గురువారం ఉదయం కాలిపోయి ఉందన్నారు. తమపై గిట్టని వ్యక్తులు రాజ్‌మా కుప్పకు నిప్పు పెట్టి ఉంటారన్నారు. సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వ ఆదుకోవాలని, తనకు నష్టం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరాడు.

గిరి విద్యార్థుల విజ్ఞానం పెంపే లక్ష్యం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- గిరి విజ్ఞాన సంబరాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చే సి సంబరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పాడేరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



చింతపల్లిలో ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థుల్లో విజ్ఞానం అందరికి పంచే లక్ష్యంతో గిరి విజ్ఞాన సంబరాలను పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని జోన్లలో ప్రారంభించామని ఐటీడీఏ పివో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక లోచలిపుట్టులోని నంబర్–1 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి పాడేరు జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలను, తలారిసింగి ఆశ్రమ పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏటా గిరిజన విజ్ఞాన సంబరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఈఏడాది అత్యంత ఘనంగా నిర్వహించే లక్ష్యంతో రూ.32లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. అరకులోయ, పాడేరు, చింతపల్లి కేంద్రాలుగా మూడు జోన్లలో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. గిరి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే సత్తా ఉందన్నారు. ఇటీవల విద్యార్థులను శ్రీహరికోట విజ్ఞానయాత్రకు పంపామని, వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో గిరిజన అభ్యర్థులకు సివిల్స్ కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుంచే వారి ఉన్నతికి ఐటీడీఏ అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన 270 నమునాలను పీవో పరిశీలించారు. వారిని అభినందించారు. 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హుకుంపేట జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో సరస్వతి, హెచ్‌ఎంలు రీమలి జాన్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం మరింత మెరుగు

అరకులోయ రూరల్: గిరి విజ్ఞాన సంబరాలు విద్యార్థుల్లో నైపుణ్యం మరింత పెంపొదిస్తాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక రవ్వలగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అరకులోయ జోన్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు.అరకులోయ, డుంబ్రిగుడ,అనంతగిరి మండలాలకు చెందిన 28 పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన తిలకించారు. విద్యార్థుల థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విద్యార్థులను అన్ని రంగాల్లో తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ ఉషారాణి, ఎంఈవో భారతీరత్నం, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు,హెచ్‌ఎంలు కెందు, దయానిధి, శెట్టి నారాయణరావు, భాస్కర్, వెంకటరావు, పీఈటీలు శెట్టి లక్ష్మణ్‌రావు, రవికుమార్, సద్దు, బాలి, ప్రసాద్, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం గిరి విజ్ఞాన సంబరాలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత ఈ ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సబెక్టుల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు సంబరాలు దోహదపడతాయన్నారు. ఈ సంబరాల్లో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇంగ్లిష్, గణితం, తెలుగు, సైన్స్‌పై పలు నమూనాలు ఆవిష్కరించారు. సుమారు 40 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు చూపరులను అలరించాయి. విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, ఎంపీడీవో లాలం సీతయ్య, వార్డెన్లు నెల్లూరి సాంబశివరావు, వినాయక రావు, హెచ్‌ఎం సాగిన రామరాజ్ పడాల్, బాలికల పాఠశాల హెచ్‌ఎం కొండలరావు పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



చింతపల్లిలో ప్రదర్శించిన నమూనాలు



రవ్వలగుడలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వాస్పత్రిలోనే సుఖ ప్రసవాలు చేయాలి


మందులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

పెదబయలు: జిల్లాలో మాతాశిశు మరణాలు నివారణనే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. మండలంలోని గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న సేవలు, కాన్పులు, ఓపీ వివరాలను వైద్యాధికారి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భం దాల్చిన మూడో నెల నుంచి వ్యాక్సిన్, నెల వారీగా గర్భిణులకు హిమోగ్లోబిన్, తదితర పరీక్షలు, ప్రసవం సమయానికి వారం నుంచి పది రోజుల ముందుగానే ఆస్పత్రికి తరలించి కాన్పులు చేయడానికి ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. హైరిస్క్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, బయటకు వెళ్తే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గోమంగి మినీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని, రోజువారీగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అడిగి తెలుసుకున్నారు. వీరికి అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహం కిచెన్‌ను పరిశీలించారు. పాడేరు అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కిముడు లీలాప్రసాద్, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, జిల్లా టీబీ సూపర్‌వైజర్ కిరణ్, ఎంపీహెచ్‌ఈవో వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం గజగజ


మంచులో ఎడ్ల బళ్లపై తరలి వెళ్తున్న రైతాంగం


మంచులో వారపు సంతకు వెళ్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: జిల్లాలో ప్రజలను కనిష్ట ఉష్ణోగ్రతలు, చలిగాలులు భయపెడుతున్నాయి.ఎముకలు కొరికేటంతంగా చలి విజృంభిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు తీవ్రత నెలకొంది.రాత్రివేళల్లో చలిపులి మరింత వణికిస్తోంది.ఉదయం 10గంటల వరకు పొగమంచు కురుస్తోంది. గురువారం అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 8.8 డిగ్రీలు, పాడేరు మినుములూరు కాఫీబోర్డు వద్ద 9 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

డుంబ్రిగుడ: మన్యంలో నాలుగు రోజుల నుంచి తీవ్రమైన చలి వణికిస్తోంది. గురువారం గిరిజనులు అనేక ఇబ్బందులు పడ్డారు. పొగ మంచులోనే మారుమూల ప్రాంతాల నుంచి హుకుంపేట వారపు సంతలో కూరగాయలు తీసుకుని వెళ్తున్నారు. చలి తీవ్రతకు గిరిజన రైతులు వణుకుతూ వారపు సంతకు వెళ్లారు. కురిడి సమీపాన మంచులోనే కొంతమంది వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకుంటూ వాహనాలు నడిపారు. ఏదేమైనా చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు.

రాజవొమ్మంగి: మన్యంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. మన్యం వాసులు గజగజలాడుతున్నారు. రాజవొమ్మంగిలో గురువారం ఉదయం 9 గంటలకు మంచు పరదాలు వీడలేదు. దీంతో దైనందిన జీవనానికి ప్రతిబంధకం అవుతోంది. సాయంత్రం 6 గంటల నుంచే వీస్తున్న చలిగాలులకు వీధుల్లో, రోడ్లపై జనసంచారం కనిపించడం లేదు. మరోవైపు చలి కారణంగా పిల్లలు, పెద్దలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. రొంప, దగ్గు, ఆయాసంతో బాధపడుతున్న వారు ఈ వాతావరణానికి మరింత ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇంటి ముంగిట చలినెగళ్లు వేసుకుని కాలక్షేపం చేస్తున్నారు. కర్షకులు మాత్రం చలిని లెక్క చేయకుండా తమ పనులు చక్కబెట్టుకుంటుండడం విశేషం.

అంతిమ యాత్ర రథం వితరణ


అంతిమ యాత్ర రథాన్ని అందజేసిన జయమ్మ

రంపచోడవరం: స్థానిక సంత మార్కెట్ వద్ద శివాలయం వెనుక కైలాస భూమికి అంతిమ యాత్ర రథాన్ని కె. జయమ్మ వితరణగా అందజేశారు. ఆమె తండ్రి జుజ్జూరు భావన్నారాయణ జ్ఞాపకార్థంగా రూ. 4 లక్షలతో దీన్ని కొనుగోలు చేశారు. భావన్నారాయణ మనవడు కె. చక్రపాణి, రమాశైలజ దంపతులు ఆలయానికి రూ. 50 వేలతో సీసీ కెమెరాలు, ఇన్వెర్టర్, టైమర్‌ను సమకూర్చారు. మాస శివరాత్రి సందర్భంగా శివాలయంలో అన్నసమారాధన జరిగింది.

ధాన్యం కొనుగోలును పరిశీలించిన జేడీఏ


కొత్తాడలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నందు

గంగవరం: వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నందు అన్నారు. కొత్తాడ రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం భయ్యనపల్లి, కొత్తాడ గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్తాడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యం తరలించేందుకు వ్యవసాయశాఖ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 591 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 3,500 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని ఏవో కె. విశ్వనాథ్ వివరించారు.

జులాజికల్ టూరుకు గిరి విద్యార్థులు


జులాజికల్ టూర్‌కు వెళుతున్న గిరి విద్యార్థులు

సాక్షి, పాడేరు: ప్రత్యక్ష పరిశీలనతో అవగాహన పెరుగుతుందని ప్రిన్సిపాల్ వి.చిట్టిబ్బాయి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన 110 మంది విద్యార్థులు జంతుశాస్త్రం విజ్ఞానంలో భాగంగా జులాజికల్ టూర్‌కు సంబంధించి బస్సులో గురువారం విశాఖపట్నం వెళ్లారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, ఆంధ్ర యూనివర్సిటీ, కృష్ణ సెంట్రల్ లైబ్రరీ, జులాజికల్ పార్కు సందర్శిస్తారన్నారు. జులాజికల్ విభాగాధిపతి రమేష్‌కుమార్, డాక్టర్ శశికళ, గౌరీశంకర్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బొలేరో వాహనం బోల్తా


బోల్తా పడిన బొలేరో వాహనం

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డు హెయిర్ ఫిన్‌బెండ్ మూడో నెంబర్ మలుపు వద్ద గురువారం రాత్రి అరకులోయ నుంచి కూరగాయల లోడ్‌తో విశాఖపట్నం వెళ్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

అరకులోయ సీఐ జీడిబాబు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీస్ సిబ్బంది

అరకులోయ రూరల్: ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అరకులోయ సీఐ జీడిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అరకులోయ పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహనా చోదకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకోవద్దని సూచించారు. పోలీస్ నిబంధనలు పాటించాలన్నారు.

ఫ్రీ స్టయిల్ కుస్తీ ఓవరాల్ చాంప్ ఆర్‌ఎస్‌పీబీ

రన్నరప్స్‌గా ఎస్‌ఎస్‌సీబీ, హర్యానా

విశాఖ స్పోర్ట్స్: సీనియర్ నేషనల్ మెన్ ఫ్రీస్టయిల్ కుస్తీ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను 188 పాయింట్లతో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్‌ఎస్‌పీబీ) సాధించింది. 157 పాయింట్లు సాధించిన సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ (ఎస్‌ఎస్‌సీబీ) రన్నరప్‌గా, 140 పాయింట్లతో హర్యానా పహిల్వాన్ల జట్టు సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. పోర్ట్ స్టేడియంలో సీనియర్ మెన్ ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్ స్టయిల్స్‌లో పోటీపడుతుండగా, సీనియర్ వుమెన్‌కు కుస్తీ పోటీలు జరుగుతున్నాయి. ఫ్రీస్టయిల్ 57 కేజీల వెయిట్ కేటగిరీలో అమన్ (ఆర్‌ఎస్‌పీబీ), ఉదిత్ (హర్యానా), రాహుల్(ఢిల్లీ) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 61 కేజీల వెయిట్‌లో పంకజ్ (ఎస్‌ఎస్‌సీబీ), రాహుల్ అవారే (మహారాష్ట్ర), రవీందర్(హర్యానా), 65 కేజీల్లో సుజీత్ (హర్యానా), ఉత్కర్ ఖలే(ఆర్‌ఎస్‌పీబీ), జస్క్రన్‌సింగ్ (పంజాబ్) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 70 కేజీల వెయిట్‌లో విశాల్ కాలి రమణ్(ఆర్‌ఎస్‌పబీ), ములాయం యాదవ్ (యూపీ), సోను (ఎస్‌ఎస్‌సీబీ), 74 కేజీల వెయిట్‌లో సాగర్(హర్యానా), నరసింగ్ (మహారాష్ట్ర), ప్రీతమ్ (ఆర్‌ఎస్‌పీబీ), 79 కేజీల వెయిట్‌లో జితేందర్(ఆర్‌ఎస్‌పీబీ), పర్దీప్(చండీగఢ్), మదీప్ (ఢిల్లీ) తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 86 కేజీల్లో విక్కీ (హర్యానా), జోంటీ(యూపీ), సంజీత్ (ఎస్‌ఎస్‌సీబీ), 92 కేజీల్లో పృథ్వీరాజ్ (మహారాష్ట్ర), ప్రవీణ్(ఆర్‌ఎస్‌పీబీ), ప్రవీణ్‌కుమార్ (హర్యానా), 97 కేజీల్లో సాహిల్ (పంజాబ్), సత్యవర్త్ (ఆర్‌ఎస్‌పీబీ), కపిల్ (యూపీ), 125 కేజీల వెయిట్‌లో దినేష్ (ఎస్‌ఎస్‌సీబీ), ఆకాష్ అంతిల్ (యూపీ), ధర్మేందర్(పంజాబ్) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం


తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు

మధురవాడ(భీమిలి): మధురవాడలోని ద్రోణంరాజు కల్యాణ మండపంలో స్కూల్ గేమ్స్ ఫెడరేష్(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా తైక్వాండో పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రాజబాబు, పీడీ రాము, వైఎస్సార్ సీపీ నాయకులు పిళ్లా సూరిబాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమంగా రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వివిధ పాఠశాలల నుంచి సుమారు 200 క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆనందరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బంగారు ప్రకాశ్, బీజేపీ నాయకులు తాతపూడి ప్రదీప్ కుమార్, బోయిపాలెం హైస్కూల్ పీడీ అప్పలరాజు పాల్గొన్నారు.

ఏవోబీలో 40 ఎకరాల్లో గంజాయి ధ్వంసం

గంజాయి మొక్కల్ని తగలబెట్టిన పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు, బరడ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి, 40 ఎకరాల్లో గంజాయి పంటను తగలబెట్టారు. దోడిపుట్టు, బరడ, మాకవరం పంచాయతీల్లోని చిన్నసింధిపుట్టు, పెద్దసింధిపుట్టు, అల్లంగిపడ, ముక్కిపుట్టు, దోడిపుట్టు, కుత్తుడా గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఏపీఎస్‌పీ, సివిల్ పోలీసులు ఆయా గ్రామాల్లో బృందాలుగా తనిఖీ చేశారు. మత్స్యగెడ్డ ఒడ్డున, పంట పొలాల వద్ద, కొండ ప్రాంతాల్లో సాగుచేస్తున్న గంజాయి పంటను గుర్తించారు. గుర్తించిన గంజాయి మొక్కలను పూర్తిగా నరికి, ధ్వంసం చేశారు. నరికిన గంజాయి మొక్కలను ఎక్కడికక్కడ పోగుగా వేసి తగలబెట్టారు. గంజాయి పంట జోలికి పోవద్దని, గంజాయి పండించడం, రవాణా వల్ల కలిగే అనర్థాలను ఎస్‌ఐ రవీంద్ర వివరించి, ఆయా గ్రామాల గిరిజనులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు ఏపీఎస్‌పీ, సివిల్ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు స్వయం పాలనాధికారం లక్ష్యం

దండకారణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండా ఏలియా


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: ఆదివాసీలకు స్వయం పాలనాధికారం కల్పిస్తేనే గిరిజన ప్రాంత హక్కులకు రక్షణ ఉంటుందని దండకారణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండా ఏలియా తెలిపారు. ఈనెల 27న పద్మపురంలో నిర్వహించే సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. దండకారణ్య రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం, నాయకులు కామేష్, జాన్‌బాబు, కేశవ్, రాజాబాబు, సూర్యప్రకాష్, భీమరాజు, రమేష్ పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకాల ప్రాజెక్టుకు మరమ్మతులు


కుళాయిని పరిశీలిస్తున్న జేఈ భగవంతరావు, ఎంపీడీవో, టీడబ్ల్యూ జేఈ

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాల్లో రక్షిత నీటి పథకాల భవనాలకు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని మండల తాగునీటి సరఫరా విభాగం జేఈ భగవంతరావు తెలిపారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి రఘుతో కలసి ఆయన గురువారం మండలంలోని గంగవరం, దబ్బకోట, దారకొండ, అసరాడ రింతాడ గ్రామాల్లో పర్యటించారు. గతంలో ఐఏపీ పథకం కింద నిర్మించిన రక్షిత నీటి పథకాలను పరిశీలించారు. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన వాటిపై దృష్టి సారించామన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా చిన్నయ్యపడాల్


అధ్యక్షుడు చిన్నయ్యపడాల్


ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సాక్షి,పాడేరు: సీఐటీయూ అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కమిటీని గురువారం పాడేరులో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బోనంగి చిన్నయ్యపడాల్, ప్రధాన కార్యదర్శిగా వి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా శెట్టి నాగరాజు, ఉపాధ్యక్షులుగా పి.బాలదేవ్, అప్పలనాయుడు, పోతురాజు, భాగ్యలక్ష్మి, కేశవ్, మోస్య, సన్నిబాబు, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, సత్యనారాయణ, అప్పలకొండపడాల్, దీనబంధు, శంకరరావుతోపాటు 57 మందిని సభ్యులుగా జిల్లా కమిటీలో నియమించారు.

ఎంఐసీసీఐ కార్యాలయం ప్రారంభం


తుంగ్లాంలో ఎంఐసీసీఐ కార్యాలయంను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎంఐసీసీఐ) కార్యాలయాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మాదిగ, మాదిగ ఉపకులాల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి రంగంవైపు అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు చిన్నచిన్న పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకొని స్వయం సంవృద్ధి సాధించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు కల్పించడంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పరిశ్రమల స్థాపనలో అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ మిక్కీ కార్యాలయం ద్వారా ఒక సలహాదారుడు, కో ఆర్డినేటర్లను నియమించి పారిశ్రామిక రాయితీల వర్తింపు, బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రభుత్వల రాయితీలపై శిక్షణ, నైపుణ్యం, వ్యాపార లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు వంటి వాటిపై సలహాలు, సూచనలు అందజేయాలని సభ్యులకు సూచించారు. 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మిక్కీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టభద్రుడు తప్పుదారి

అప్పు తీర్చేందుకు గంజాయి విక్రయాలు


నిందితుడు అమర్‌నాథ్

బెంగళూరు: స్నేహితునికి బాకీ పడడంతో దానిని తీర్చేందుకు ఒక ఎంబీఏ పట్టభద్రుడు తప్పుదారి పట్టాడు. డ్రగ్స్‌ను అమ్ముతూ సొమ్ము సంపాదించాలనుకుని కటకటాల పాలయ్యాడు. బెంగళూరు బాణసవాడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. నిందితుడు విశాఖపట్నానికి చెందిన అమర్‌నాథ్. పోలీసులు తెలిపిన మేరకు అమర్‌నాథ్ ఉద్యోగం కోసం కొంతకాలం కిందట బెంగళూరుకు వచ్చాడు. ఓసారి స్నేహితుని కారును తీసుకుని వెళ్లి యాక్సిడెంట్ చేయడంతో దాని మరమ్మతులకు కొంత డబ్బు అవసరమైంది. స్నేహితుని వద్ద అప్పు చేసి రిపేరీ చేయించాడు. ఒకవైపు అప్పు తీర్చాలని, మరోవైపు డబ్బు సంపాదన కోసం నగరంలో గంజాయిని అమ్మడం ప్రారంభించాడు. కమ్మనహళ్లి వద్ద గంజాయి ఆయిల్‌ను అమ్ముతున్నట్లు తెలిసి పోలీసులు అమర్‌నాథ్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ. 12 లక్షల విలువ చేసే గంజాయి ఆయిల్‌ను సీజ్ చేశారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో టీం చాపియన్‌గా విశాఖ


బాలికల విభాగంలో విజేతగా నిలిచిన విశాఖపట్నం జిల్లా జట్టు

ప్రొద్దుటూరు కల్చరల్(వైఎస్సార్ జిల్లా): ఎస్జీఎఫ్ అండర్–17, అండర్ –19 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో టీం చాంపియన్‌గా విశాఖపట్నం జట్లు నిలిచాయి. గురువారం రెండో రోజు జార్జికారొనేషన్ క్లబ్, కేఎస్‌ఎన్ బ్యాడ్మింటన్ అకాడమిలో ఎస్జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ బ్యాడ్మింటన్ టీం చాంపియన్‌షిప్ విభాగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ –17 విభాగం ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం బాలికల జట్టు తూర్పు గోదావరిపై విజయం సాధించి చాంపియన్ షిప్ సాధించింది. అండర్–19 బాలుర విభాగంలో విశాఖపట్నం, పశ్చిమగోదావరి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. బాలికల విభాగంలో చిత్తూరు జట్టుపై విశాఖపట్నం జట్టు గెలిచి చాంపియన్ షిప్ సాధించింది.

కళాభారతితో నేటి నుంచి డ్యాన్స్ ఫెస్టివల్

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 25వ తేదీ వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభకానున్నాయని వీఎండీఏ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు తెలిపారు. తొలిరోజు శుక్రవారం శృంగార శ్రీనివాసం నృత్యనాటికను వీవీఎస్.జగన్నాథరావు నృత్య పరికల్పనంలో ప్రదర్శించనున్నామన్నారు. దీనికి సంగీత పరికల్పన జి.రాశేఖర్ అందించారన్నారు. అలాగే 24న అమెరికాకు చెందిన డాక్టర్ శ్రియ శ్రీనివాసన్ భరతనాట్య ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా నాట్య గురువు ఏబీ బాలకొండలరావు హాజరుకానున్నారని తెలిపారు. 25న కృష్ణంవందే జగద్గురు బృంద నృత్యాన్ని చెన్నైకి చెందిన కుంజిత పాద మందిరం ఆర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూరింటిండెంట్ సంజయ్ సదు పాల్గొనున్నారు.